# భార్యల్లోనే ఉంది

తాయారమ్మ ఏడుస్తూ కూర్చుంది. భారతనారీమణి అంత కంటే ఏంచేస్తుంది?

పూర్వకాలంలో అయితే తలకు వాసెనకట్టు కట్టి, కన్నీరు మున్నీరుగా ఏడ్చేది. ఇప్పుడు గదిలో ఒకమూల కూర్చొని, కుమిలి కుమిలి ఏడుస్తుంది. మొత్తంమీద ఏదో ఒక యేడుపు. జీవితమంతా ఏడ్చిఏడ్చి పోయేటప్పుడు ఒక బుల్లివికారపునవ్వు నవ్విపోతుంది. 'మహాపతివ్రతమ్మా! ఎటువంటిచావు చచ్చింది!' అని మిగిలిన అమ్మలక్కలు అంతా నోరూర్చుకుంటారు. దాని ప్రాశస్త్యాన్ని గురించి పురుషులు పుస్తకాలు రాస్తారు. కన్నీటి చుక్క వూరే స్థలాన్నుంచి, పడే ప్రదేశంవరకూ వర్ణిస్తారు. పడి, ఎంత సుతారంగా చింది, ఏవిధంగా ఆరిపోతుందో కూడా వర్ణిస్తారు. ఈ వాతావరణంలో పెరిగిన భారతనారీమణి కష్టాలను ఏవిధంగా ఎదుర్కుంటుంది? కష్టాలను ఎదుర్కోలేక ఏడ్చి ఏడ్చి, చివరకు పతివ్రత అయి వూరుకుంటుంది. ఈ విధంగా నడుస్తూవుంది హిందూదేశం.

అయితే, నే నిప్పుడు రాసేది తాయారమ్మని గురించి — హిందూదేశాన్ని గురించీ కాదు, పాతివ్రత్యాన్ని గురించీకాదు.

తాయారమ్మ ఏడుస్తూవుందని చెప్పాను. అందులో ఆమె తప్పేమీలేదని ఇప్పుడు చెపుతున్నాను. ఏడవక ఏంచేస్తుంది? ఒకే ఒక భర్తని నమ్మి, తన జీవితాన్ని అతనికి అర్పించివేసింది. ఇప్పుడతనికి తాను పనికిరాకుండా పోయింది. అతనికి ఏదన్నా అపకారంచేస్తేనో, తిప్పుచేస్తేనో, అవమానపరిస్తేనో అనుకో

వచ్చు. అదేమీ లేదు.

ఒక సంవత్సరంనుంచీ ఆమె శరీరంలో దొంగు ఏర్పడి, ఆమె ఇష్టం లేకుండానే పెరుక్కొచ్చింది. లావయితే వికారంగా వుంటానని ఆమెకి తెలుసు. అందుకని తగ్గటానికి చాలా ప్రయత్నించింది. మందులు తిన్నది. భోజనం మానేసి, పళ్ళ రసంమీద బ్రతికింది. ఆ శరీరంతో వన్,టూ-వన్, టూ-వన్ టూ అనుకుంటూ కసరత్తు చేసింది. ఏంచేసినా నాలుగు రోజులు తగ్గినట్లేవుండి, బుస్సున పొంగు కొచ్చేది. శరీరం అన్న తరవాత పిరక్కా, తరక్కా వూరుకుంటుందా? ఇంతమాత్రానికే ఇంత కష్టపెట్టాలీ!

మొదట్లో తాయారమ్మభర్త చాలా ప్రేమగావుండేవాడు. వాల్జడలాగా, నీడలాగా, అంటుకుని తిరుగుతూ వుండేవాడు. ఒకరోజున, "తాయారమ్మా, నీ కీ పేరు బాగుండలేదు, మార్చేద్దాం" అన్నాడు.

"పోనిద్దురూ"

"అలా కాదు, నా మాట విను"

ఆమెకూ పేరు మార్చుకోవాలనే వుంది. ఏ పేరయితే బాగుంటుందా అని మీమాంస వచ్చింది.

"పుష్పావతి." అన్నాడు.

"ఛీ, పాడు!" ఆమెకు ఈపేరు రజస్వాలానంతర వివాహాన్ని జ్ఞప్తికి తెచ్చింది.

అతడు మరొక పేరు చెప్పాడు.

"రాజరాజేశ్వరి"

ఆమెకు కన్యకాపరమేశ్వరి జ్ఞాపకంవచ్చి కోమట్లుకట్టించే

మేడలూ, సత్రాలూ, ధాన్యపుబస్తాలూ కళ్ళముందు కదిలినై. ఆమె వొప్పుకోలేదు.

"అయితే నువ్వే చెప్పు. నాకు తోచటంలేదు." అన్నాడు. అప్పటికి ఆమెకీ తోచలేదు. మర్నాడు చెప్పింది—'మైథిలి' అతనికి మిథునం జ్ఞాపకం వొచ్చింది. 'మిథునం దంపతులు —కర్కాటకం, ఎండ్రకాయ' అని హాస్యం చేశాడు.

ఆమెకు సిగ్గువేసి ఆ రోజునుంచీ ఆ వూసెత్తటంమానేసింది. ఒకరోజున అతడే చెప్పాడు.

'శ్యామల'—'శ్యామ'

ఆ రోజులకూ, తయారమ్మ లావెక్కిన ఈ రోజులకూ ఎంత భేదం? ఇప్పుడు అతను తాయారమ్మని షికారు తీసుకువెళ్ళటం మానేశాడు. వెళ్ళినా, చీకటిపడ్డతర్వాత రెండో ఆటకు తీసుకు వెళ్ళి, సరాసరి ఇంటికి జేరవేస్తున్నాడు. మరో స్త్రీ జతవుంటే, పార్కుకు తీసుకు వెళ్తాడు. చూచేవాళ్ళు, వాళ్ళిద్దరిలో తన భార్య ఎవరో తెలుసుకోలేరని అతని ధైర్యం. ఆమెని చూడగానే, వొదులొదులుగా వున్న ఎరువుచొక్కా తగిలించుకున్న వాడిలాగా చీదరించుకుంటున్నాడు. సాయంకాలం ఆమె తల దువ్వుకొని, పూలు ముడుచుకొని సింగారించుకొని కంటబడితే ఆమెశరీరాన్ని కొలుస్తున్నట్లుగా, సిలెండర్ని చూచినట్లు చూచి వెళ్ళిపోతున్నాడు.

ఇక ఆ యింట్లో తాయారమ్మ ఎలా వుంటుంది?

ఎందుకుండాలి? అందులో పతివ్రతకూడాను—'నాకు లేని సుఖం లేనేలేదు. ఆయన్ని కష్టపెట్టటం ఎందుకు?' అనుకున్నది. వెంటనే పుట్టింటికి బయలుదేరింది. ఆ శరీరాన్ని అతికష్టంమీద

బస్సులు నిలిచే స్థలానికి చేరవేసింది.

బస్సులు వస్తున్నాయ్, పోతున్నాయ్. దిగేవారు దిగుతున్నారు. ఎక్కేవారు ఎక్కుతున్నారు.

ఆ జనాన్ని చూస్తే - ఆమెకు దిగులువేసింది. హఠాత్తుగా అసహ్యం వేసింది. ఈపాడుప్రపంచంలో ఒకరిసంగతి ఒకరికిపట్టనే పట్టదుగదా! ఎక్కడ కీప్రయాణాలు? ఎందుకీ తొందర? కొంపలన్నీ మునుచుకుపోతున్నాయా?—అంతలో తనకూ యీమానవ జాతికీ ఏమీసంబంధంలేదని ఆమెకు అనిపించింది. మరి ఇక ఎవ్వరితో సంబంధం? ఆ బస్సులతోనా? శరీరం కంపించింది. ఒక బస్సు ఝుయ్యిన మోతచేసుకుంటూ బయలుదేరింది. ఇకామె అక్కడ నిలబడలేకపోయింది. పుట్టింటికి తన్ను మోసుకుపోయే బస్సు వచ్చేదాకా, కొంచెందూరంగా కూర్చుందాంఅనుకుంది.

అక్కడికి ఇరవై గజాల దూరంలో ఒకపిల్ల కూర్చునివుంది—మూటపక్కనపెట్టుకొని, చెట్టుని ఆనుకొని కూర్చుంది. తాయారమ్మ అక్కడికి నడిచింది. ఆ పిల్లని చూడగానే, తాయారమ్మ హృదయం కొట్టుకుంది. ఆ పిల్ల, ఎంత సన్నగావుంది! ఎంత నాజూగ్గావుంది!! అవ్వాయి చువ్వలాగా, చాకల్లే, వుండేలు బద్దలాగావుంది. పక్కనించి చూస్తే, ఆమె చంప కోసిన హల్వాముక్కలాగాఉంది. ఆ పిల్లని చూచినకొద్దీ తాయారమ్మ శరీరం బరువెక్కింది. గుండెలు బిగబట్టినై. ముందు నెమ్మదిగా చేత్తో ఆనుకొని, చతికిలబడింది. శరీరాన్ని అంతచక్కగా సున్నితంగా, సునాయాసంగా వుండేటట్లు ఎలా పోషించుకోగలుగుతూ వుందో అడిగి తెలుసుకుందామని బుద్ధిపుట్టింది. కాని, ఎలా అడగటం? ఏమని పిలవటం? ఏమీ తోచలేదు.

కొంచెం సేపుండి ఇలా అన్నది—"ఆకులు రాలిపోతున్నాయ్."

"ఊ?" అంటూ ఆ పిల్ల ఆమెవైపుకు తిరిగింది. తిరిగినపళంగా ఆ పిల్ల చూపులు అలాగే గుచ్చుకుపోయినై. తాయారమ్మని ఆశ్చర్యంగా చూస్తూ, చూపులు తిప్పుకోలేకపోయింది.

తాయారమ్మ అంతశరీరం ఫుడికిపోయింది. ఆ పిల్ల ఇంకా ఇటే చూస్తూవుంది. ఏదో మాట్లాడాలి—"ఈ వూళ్ళో రాలిన ఆకులకన్నా పురుషులు ఎక్కువ వున్నారు."

ఆ పిల్ల జవాబు చెప్పలేదు. అలాగే ఆశగా, జాలిగా చూస్తూ వుంది. తన భర్తలాగే తన శరీరాన్ని కొలుస్తూవుందా? ఆమె చూపుల్ని మరల్చాలి—"ఎండిన ఆకులు గలగలమంటాయ్".

"అవును." అన్నది పిల్ల

"తొక్కితే అంటయ్."

"తొక్కకపోయినా అంటయ్."

ఆ పిల్లది ఎంత చక్కని గొంతు! పెదవి కదిపితే, అమృతం వొలుకుతూవుంది. తాను మాట్లాడితే బావిలోనుంచి మాట్లాడినట్లు ఉంటుంది. సళసళ కాగే నూనెలో నీటిబొట్లు పడ్డట్లు ఉంటుంది. గచ్చుమీద రాతిముక్కతో గీచినట్లు ఉంటుంది. ఇంత పెద్ద శరీరంలోనుంచి పెకలించుకొచ్చే ఆ కీచుగొంతు తలుచుకుంటే, ప్రాణం చివుక్కుమన్నది. ఏమన్నా కానీ అడగాలి. ఇవన్నీ ఎలా అలవరచుకుందో అడగాలి. ఆ పిల్లవంకకు చూడకుండా పుల్లతో ఇసుకలో గీస్తూ ప్రశ్నించింది.

"చూశారా?"

"ఏమిటి?"

"అదే!"

"ఏదీ ?"

"అదే"

"బస్సా ?"

"ఊం"

ఇక సంభాషణ సాగలేదు. రెండు బస్సులు పెద్ద మోతతో వచ్చి ఆగినయ్. ఒక బస్సు పెద్దమోతతో బయలుదేరింది. ఎందుకో చెప్పలేంగాని, ఆ బస్సు చేసిన మోతకు తాయారమ్మకు ధైర్యం వచ్చింది—"వెధవమోత"

"ఊ ?" ఆపిల్ల రెప్ప వెయ్యటంలేదు.

"మోత"

"ఏదీ?"

"అదే"

"ఓహూ"

"బస్సు"

ఆ పిల్ల తాయారమ్మని గుటకలు మింగుతూ చూస్తూనేవుంది. తాయారమ్మకి తగని సిగ్గు. స్నానాల గది జ్ఞాపకం వచ్చింది. బస్సుల్లో జనం ఎక్కుతున్నారు, దిగుతున్నారు. ఈ బస్సులన్నీ జనాన్ని ఒక ప్రపంచాన్నుంచి మరొక ప్రపంచానికి జేరవేస్తున్నయ్యా? ఎక్కడా దిక్కుండా అలాగే తిరుగుతూవుంటే ఎంత బాగుంటుంది! కుంటివాళ్ళ బళ్ళు అలాగే తిరుగుతూవుంటై. వాళ్ళకి అదే ఇల్లు—అదే ప్రపంచం.

"ఏవూరు వెళ్తున్నయ్యో ?"

అడిగింది తాయారమ్మ.

"ఏవి ?"

" బస్సులు "

" ఏమిటా !"

తాయారమ్మకు ధైర్యం ఎక్కువయింది—"మీ దేవూరు?"

" నాదా ?"

" ఊఁ "

" వెళ్తున్నాను. "

" ఎక్కడికో !"

" పుట్టింటికి." ఆపిల్ల చాలా విచారంగా చెప్పింది.

సన్నగా నాజూగ్గా వున్న అమ్మాయికూడా పుట్టింటికి ఎందుకు వెళ్ళటం ? తాయారమ్మ ఆలోచించింది...

బస్సు బయలుదేరింది. ఒక ముసలమ్మ రెండు మూటల్తో తూలిపోతూ వచ్చింది. కండక్టర్లు మాబస్సు ఎక్కమంటే మా బస్సు ఎక్కమని చెరొక రెక్క పట్టుకొని లాగుతున్నారు. చెరొక మూటా తీసుకొని తమ కారుల్లో కూర్చున్నారు. ఆముస లమ్మ అటూ ఇటూ చూస్తూ, వెర్రిచూపుల్తో నిలబడిపోయింది.

తాయారమ్మ ఆపిల్లతో చెప్పింది_"మీరు సన్నగా వున్నారు."

"నేనా?"

" ఊఁ "

" సన్నగానా ?"

" ఊఁ "

ఆ పిల్ల మాట్లాడలేదు.

" ఎలా వుండగలిగారు ?"

" నాకర్మ "

తాయారమ్మ ఉలిక్కిపడింది. వారిద్దరి మధ్యా వున్న మంచు

తెర విడిపోయింది. తాయారమ్మ ఆ పిల్లని సూటిగా చూచింది.

"ఏ వమ్మా!"

"నేను సన్నగా వుంటం మావారికి ఇష్టంలేదు"

"ఇష్టంలేదూ?"

"ఊహుఁ"

"ఎందు కని ?"

"లావుగా లేనని!" ఆపిల్లకళ్ళల్లో నీళ్ళు గిర్రునతిరిగి, చెక్కిళ్ళ మీదుగా జారుతున్నాయి.

తాయారమ్మ శరీరం కదిలింది; నూతన చైతన్యాన్ని పొళ దింది; హృదయం ఆరాటపడింది. ఏమిటిది ? ఏదోబాధ, తెలి యని వుత్సాహం, అర్థంకాని ఆ వేదన ఆమెని కలవరపరచాయి. కొందరికి సన్నగా వుంటంకూడా ఇష్టం ఉండదూ? మళ్ళీ ఈ భర్తల్లో ఇన్నిజాతులా? ఏజాతి భర్తకు అనుకూలంగాఆభార్య తయారవ్వాలీ! భార్యకు వేరే జీవితం లేదూ? భర్త జీవితంతో కలిపి, అల్లుకు పోవటమేనా? ఆ పని భర్త లెందుకు చెయ్యారు? పక్కనున్న పిల్లసంగతి కూడా మరిచిపోయి, తీవ్రాలోచనలో పడిపోయింది.

"నాకొక్కసంగతి చెప్పరూ ;" అని ఆపిల్ల అడిగింది-కన్నీళ్లు వేళ్ళతో తుడుచుకొని రెప్పలు రెపరెపలాడించి ముందుకు వంగి అడిగింది.

కాని తాయారమ్మ వినిపించుకోలేదు. వినిపించుకునేస్థితిలో లేదు. ఇద్దరు భార్యాభర్తలు ఆమెముందునుంచి బస్సుదగ్గరకు వెల్తున్నారు. భర్త వెనుకవచ్చే పదార్థంతో తనకేమీసంబంధం లేదన్నట్లుగా నడుస్తున్నాడు. వెనుకవచ్చే ఆ పదార్థంమాత్రం

చంకన మూటపెట్టుకొని, భర్తమీదే చూపులువుంచి, అతన్ని కలుసుకోటానికి అడుగులు వేస్తూవుంది. ఆ పిల్ల దీనంగా అడిగింది—"చెప్పరూ, మీరింత లావు ఎలా అయ్యారూ?"

తాయారమ్మకి ఆ పిల్ల కనిపించటంలేదు. ఆమె మాటలు వినిపించటంలేదు. మరొక భర్త బస్సు ఎక్కాడు. పిల్లనిచంకన పెట్టుకొని, భార్య ఎక్కటానికిప్రయత్నిస్తూవుంది. పిల్లచంకలోనించి జారిపోతూవుంది. ఆమె సిగ్గుతో చచ్చిపోతూ, ఎక్కలేక బాధపడుతూ భర్తని జాలిగా చూచింది. భర్త క్రోధంగా చూచి, గిరుక్కున తలతిప్పుకున్నాడు. పిల్ల ఏడ్చింది. కండక్టరు 'ఇదొక తగలాటం' అన్నాడు. భర్త లోలోపల ఉడికిపోతున్నాడేకానీ మొహం తిప్పలేదు. ఈ పరిస్థితుల్లో ఆమె తన భార్య అని ఇతరులకు తెలియనివ్వటం ఇష్టంలేక ప్రాణాలు బిగబట్టుకొని కూర్చున్నాడు.

తాయారమ్మ ఆలోచించింది— ఏ భర్తఅయినా ఇంతేనా? ఇన్నిరకాల భర్తల్లో తనభర్త ఒకడా? కొన్ని దృశ్యాలు సినిమాలోలాగు మొహానమొత్తినట్లు కనుపించినై తాయారమ్మకి.

—ఒకటో దృశ్యం—

పొరుగింటి సుబ్బయ్య పిల్లలు కలగలేదని అహర్నిశలూ భార్యను వేపుకుతిన్నాడు—"ఎందులోనన్నా పడిచావరాదూ పీడావొదుల్తుంది." ఆ యిల్లాలు ఒక్కటే ఏడుపూ. మర్నాడే సుబ్బయ్య మరొక భార్యను కట్టుకున్నాడు.

—రెండో దృశ్యం—

వెంకయ్య కనిపించాడు. పిల్లలు అక్కర్లేదు అనుకున్నకొద్దీ పిల్లలు కలిగారని భార్యని తరిమేశాడు. ఆమె ఆత్మహత్యచేసు

కుంది. కిరసనాయులు పోసుకొని, కాల్చుకొని మరీ చచ్చింది.

ఈ ఆలోచనలో తాయారమ్మ శరీరం వొణికిపోయింది. అన్నిటికీ భార్యలదే బాధ్యతా? ఇలా ఎందుకు జరగాలి? తప్పె వరిది? భర్తల ఆజ్ఞల్ని ప్రశ్నించకుండా పాలించే భార్యల దేనా? నేనెందుకు లావు తగ్గాలి? నాకుమల్లే మా ఆయన ఎందుకు లావు అవగూడదూ?

అకస్మాత్తుగా తన భర్త సన్నగా బుగ్గలు తోసుకుపోయి అసహ్యంగా వుంటాడని తెలుసుకుంది. ఆయన లావు అవ్వాలి సిందే. కనుక్కుంటాను—లావు అవ్వాలిసిందని అడుగుతాను.

ఆ పిల్ల అడిగింది. "చెప్పరూ? నా కాపరం నిలబెట్టరూ?"

తాయారమ్మ వినిపించుకోకుండా ఇంటికి బయలుదేరింది. అంత శరీరం దూది పింజలాగుంది. ఆబరువు ఏమయిందో గబ గబా యింటికి వెళ్ళింది. ఇంట్లో ఆమె భర్త వంటగదిలో చేతులు కాల్చుకుంటున్నాడు. కత్తిపీట ఒకమూల పడివుంది. బెండకాయముక్కలు తరిగి ఒక పళ్లెంలో వున్నాయి. పొయ్యి మీద ఏదోవుడుకుతూవుంది. అతడుపడే అవస్థ చూచేటప్పటికి తాయారమ్మకు జాలివేసింది. కోపం మాయమైపోయింది. అడుగుదాం అనుకున్న ప్రశ్నలన్నీ ఆమె హృదయంలోనే ఇంకిపోయినై. అలాగే చూస్తూ నిలబడిపోయింది.

అతడు మసిగుడ్డ తెచ్చాడు. మసిగుడ్డతో పొయ్యిమీద గిన్నె దించబోయాడు. మసిగుడ్డ ఒక పక్కకు పోయింది. చెయ్యి మరో అంచు పట్టుకుంది. కాలింది 'ఉష్' అని వేలు నోట్లో పెట్టుకున్నాడు.

తాయారమ్మ హృదయం రెపరెపలాడింది. పురుషులంతా

పసిపిల్ల లే! ప్రవర్తించుటలో భేదంగాని, అంతా అమాయకు లే! అనాదినుంచీ స్త్రీజాతిలో జీర్ణించుకుపోయిన బానిసత్వం (కవిత్వ భాషలో మాతృహృదయం) పైకి వుబికింది. కన్నీటిబొట్లు జొటజొటరాలాయి–"మీ కెందుకొచ్చిన అవస్థ చెప్పండి...

అతడు తలపై కెత్తి చూశాడు. గడపనిండా తాయారమ్మకనిపించింది. కోపం వచ్చింది. పౌరుషంవచ్చింది.నోట్లోనుంచి వేలు తీసి, మళ్ళి పొయ్యిమీద గిన్నె దించపోయాడు. తాయారమ్మ చెయ్యి ఇవతలకులాగి, "చాలెండి, సంతోషించాం. మీరు వెళ్ళి స్నానంచెయ్యండి.స్నానమయ్యేటప్పటికివంటపూర్తిచేస్తా"అంది

అతడు ఉరిమిచూస్తూ, "ఇందాకటినుంచీ, ఎక్కడచచ్చావ్? ఏకొంపలు పట్టుకు తిరుగుతున్నావ్." అన్నాడు. చెడామడా తిట్టి వేలు నోట్లో పెట్టుకున్నాడు.

అతని కోపం చూస్తే, ఆమెకు ఆనందం కలిగింది. అతని కోపం ఆమె బానిసహృదయానికి ఆహ్లాదాన్ని కలిగించింది. జీవితంలో ఒక్క ఘడియ నూతనాభిప్రాయాలతో నలిగి, ఉడికి, బాధపడ్డ ఆమెమనస్సుకి అప్పుడు శాంతి లభించింది.

"ఊఁ పిమ్మట," అని అతన్ని చూచి చిరునవ్వు నవ్వింది.

అతనికి అసహ్యం వేసింది. అక్కడనుంచి చెరచెరా వెళ్ళిపోబోయాడు. ఏదో జ్ఞాపకంవచ్చి, గడపలో ఆగి తిరిగిచూశాడు. తాయారమ్మ తృప్తిగా భూదేవిలాగా పొయ్యిదగ్గర కూర్చుని పొయ్యి వూదటానికిగాను ముందుకు వంగటానికి ప్రయత్నిస్తూ వుంది.

"ఛీ! ఎంత లావుగా చతికిలబడింది." అని అతడు తనలో తాను అసహ్యించుకొని బయటికి వెళ్ళాడు.

# డబ్బు! - డబ్బు!! - డబ్బు!!!

అప్పుడే బజారునుంచి ఇంటికివొచ్చిన గోపీకి ఇల్లంతా గల్లంతుగా కనిపించింది. తండ్రి వరండాలో విచారంగా పచారుచేస్తున్నాడు. గోపీని చూచి పెదమొహం పెట్టి, "వైరొచ్చింది. పెదనాన్న బ్రతకడట!" అన్నాడు.

గోపీ హృదయం హఠాత్తుగా ఆగిపోయి నట్లయింది. అలాగే నిలబడిపోయాడు...

పెదనాన్నంటే అతనికి ప్రాణం. తన్ను పెంచాడు. చేతుల మీదుగా పెద్దవాణ్ణి చేశాడు. "నా కేమీ కోర్కెల్లేవురా. నీవు పెద్దవాడవైతే చూచిపోదామని వుంది." అనేవాడు. ఎంత పనిజరిగింది?

తండ్రి కన్నీరు తుడుచుకుంటూ అడిగాడు—

"వస్తావా ?"

గోపీ వస్తాను అన్నట్లు తలూపాడు.

"నాదగ్గర డబ్బు లేదు. అయిదు రూపాయీలుంటే ఇవ్వు"

గోపీ మాట్లాడలేదు. జేబులోవున్న అయిదురూపాయీలూ తీసియిచ్చాడు.

తండ్రి పెట్టే బట్టలూ సర్దుకుంటూ, "ప్రయాణంఅవ్వు. రైలు టైమైంది. ఆలస్యం అయితే ఆఖరిచూపులుకూడా అందవు." అన్నాడు.

గోపీ కన్నీరు కనపడకుండా మొహం అవతలకు తిప్పుకొని, "మీరీ బండికి వెళ్ళండి. నేను సాయంకాలం వస్తాను." అన్నాడు.